## టీడీపీను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 50 కుటుంబాలు

**- పార్టీ కండువాకప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి**

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

నియోజకవర్గంలోని వజ్రకరూరు, కూడేరు మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల 50 కుటుంబాలు ఆ పార్టీను వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయని ఆ పార్టీ వర్గాలు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వజ్రకరూరు మండలానికి చెందిన భూమక్క, చాంద్‌బాషా, భాస్కర్, మహమ్మద్ రఫీ, దేవేంద్ర, చిన్న, రామలింగ, లాలెప్ప. లాలుస్వామి, మునిస్వామి, ఓబులేసు, కాసీమ్, ఈరుట్లయ్య, సురేష్, గణేష్, లాలుస్వామి, పెద్ద ఓబులేసు నాయకులు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విశ్వేశ్వరరెడ్డి గెలుపుతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. తట్రకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ్, విరుపాక్షి, నాగరాజు, ధనుంజయ తదితరులు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరగా కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన హరిజన వన్నూరుస్వామి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచి నీటి సరఫరా అని బ్యానర్ కట్టి ఉప్పునీటి సరఫరా..!

**- ఉరవకొండలో మొదలైన పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటి సరఫరా - ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులిచ్చిన జాబితా మేరకు ట్యాంకర్లు పంపుతున్నామన్న కార్యదర్శి**

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



ట్యాంకర్‌కు మంచినీటి సరఫరా అని బోర్డు పెట్టిన దృశ్యం

మంచినీటిని సరఫరా చేస్తున్నామని ట్యాంకర్లకు బ్యానర్లు కట్టి ప్రజలకు మాత్రం ఉప్పు నీటిని (తాగడానికి మినహా ఇతర అవసరాలకు ఉపయోగ పడే) సరఫరా చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. దాదాపు 4 నెలల కాలంగా పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చి 20 నుంచి నెలరోజులకు ఒకసారి కూడా కుళాయిలకు నీటి సరఫరా జరుగని పరిస్థితులు ఏర్పడిన క్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ద్వారా ట్యాంకర్లచే నీటి సరఫరా బుధవారం నుంచి ప్రారంభించారు. అయితే ఉప్పునీటి సరఫరావల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తాగునీటిని సరఫరా చేస్తే ఉపశమనం లభిస్తుందని అత్యవసర సమావేశంలో వార్డు సభ్యులు మూకుమ్మడిగా పాలకపక్షానికి, అధికారులకు సూచించినా ఆ దిశగా చర్యలు చేపట్టకుండా ఉప్పునీటి సరఫరానే మొదలు పెట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ 5 ట్యాంకర్లను ఏర్పాటు చేసి చాలా రోజులుగా కుళాయిలకు నీటి సరఫరా జరుగని ప్రాంతాల జాబితాను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అందించగా వాటి ప్రకారం ఆయా వార్డులు, వీధులకు ట్యాంకర్లను పంపుతున్నామన్నారు. తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఇతర అవసరాలకు వాడుకోవడానికి నీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు.

## తాగునీటి కోసం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముట్టడించిన మహిళలు

**- కార్యాలయ ప్రధాన గేటు మూసివేసి ఖాళీ బిందెలతో ఆందోళన**

**- దాదాపు నెలరోజుల తరువాత అరగంట నీరు వదిలారని ఆగ్రహం**

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం గేటు మూసివేసి ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న దృశ్యం

తాగునీటి కోసం పట్టణంలోని 11వ వార్డుకు చెందిన మహిళలు బుధవారం ఉదయం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంను ముట్టడించారు. ఖాళీ బిందెలతో కార్యాలయం వద్ద చేరుకున్న వారు అక్కడ సమస్యను వినే అధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ప్రధాన గేటును మూసివేసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ 11వ వార్డుకు దాదాపు నెలరోజుల తరువాత బుధవారం ఉదయం నీరు వదిలారని కేవలం అరగంట మాత్రమే కొన్నికుళాయిలకు నీరువచ్చాయని అనేక ప్రాంతాల్లోకి కుళాయిలకు నీరు రాలేదని వాపోయారు. ఒకవైపు ఎండలు మండిపోతుంటే తాగునీటి కోసం అలమటించిపోతున్నామని జిల్లాలో ఎక్కడాలేనివిధంగా ఉరవకొండలో 20నుంచి నెలరోజులకుఒకసారి అదీ ఇష్టారీతిగా నీటిసరఫరా జరుగుతోందని వాపోయారు. నీటి సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ కృషి చేయడంలేదని మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులైన ఉరవకొండలో నీటి సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు.

## కార్మికుల హక్కుల సాధనకై అవిశ్రాంత పోరాటం

**- కార్మిక దినోత్సవం వేడుకల్లో సీపీఎం మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్**

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



జండా ఎగురవేస్తున్న పార్టీ మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్

కార్మికుల హక్కుల సాధనకై అవిశ్రాంత పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్ అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చికాగో నగరంలో పని గంటల కోసం పోరాడి ఎంతోమంది కార్మికులు అసువులు బాయగా వారిరక్తం నుండి పుట్టినటువంటి ఎర్రజెండా నాటి నుండి నేటి వరకు కూడా ఎన్నో పోరాటాలు చేసి పాలకుల మెడలు వంచి కార్మికుల హక్కులను పరిరక్షించడంలో కీలక భూమిక పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల సహాయ కార్యదర్శి శీనప్ప, నాయకులు మురళి, వీరాంజినేయులు, అంగన్‌వాడీ సంఘం నాయకురాలు ధనలక్ష్మి, కార్మిక సంఘం నాయకులు శ్రీకాంత్ వర్మ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

**వజ్రకరూరులో...** మండలంలో బుధవారం మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో సీఐటీయూ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి విరుపాక్షి ముఖ్య అతిధిగా హాజరై జండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో హమాలీ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, శీన, శివ, మాబుబాషా, లేపాక్షి, నరహరి, పోతప్ప, లోకేష్, మధ్యాన్న భోజన ఏజెన్సీల సంఘం నాయకులు రంగమ్మ, సీఐటీయూ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకి న్యాయంచేసే కూటమి మేనిఫెస్టో

**- అన్నదాతలను మోసం చేసే మేనిఫెస్టో వైసీపీది**

**- పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత**

పెనుకొండ, మే 1 ప్రభాతవార్త



కరపత్రాలు విడుదల చేస్తున్న సవిత

అన్నివర్గాలకి న్యాయంచేసే కూటమిమేనిఫెస్టోఅని పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యేఅభ్యర్థి సవితఅన్నారు. బుధవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ జాతీయ అ ధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బిజెపి ఇన్‌చార్జ్ సిద్దార్థ్‌నాథ్‌సింగ్‌లు ఎన్నికలమేనిఫెస్టోని విడుదలచేశారన్నారు. ప్రతి వర్గానికి మేలు చేకూరే విధంగా ఉందన్నారు. రాజధాని అమరావతి, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో కూటమిగా జతకట్టామన్నారు. మెగాడిఎస్సీ మీదే చంద్రబాబు తొలి సంతకం చేసి నిరుద్యోగులకు అండగా ఉంటారన్నారు. బిసిల రక్షణకు ప్రత్యేకచట్టంతో వెనుకబడినవర్గాలకు ఊరటగా ఉంటుందన్నారు. రైతుకులు ఏడాదికి 20వేలు పెట్టుబడి సాయం అందించి రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామన్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అధికారకంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తామన్నారు. అనంతరం మేనిఫెస్టో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో రాంపురం సర్పంచు శ్రీనివాసులు, శ్రీరాములు, త్రివేంద్ర బాబిరెడ్డి, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్మికుల దినోత్సవం

గుత్తి, మే 1 ప్రభాతవార్త



కార్మికుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి, గుత్తిఆర్ ఎస్‌లో బుధవారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యం లో కార్మిక దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించుకున్నా రు. ఈ సందర్భం గా టమోట మార్కెట్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో హమాలి యూనియన్ కార్మికులు పతాకావిష్కరణ గావించారు. నాయకులు రమేష్‌బాబు, రామదాసు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జెడ్ వీరారెడ్డి కాలనీలో సిఐటియు కార్యదర్శి నిర్మల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఏపి ట్రాన్స్‌కో గుత్తి డివిజన్ కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సంబంధిత నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బళ్లారి వాసి మృతి

గుత్తి, మే 1 ప్రభాతవార్త



వ్యక్తి మృతి చెందిన దృశ్యం

పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారి సమీపంలోని హోస్లి గ్రామానికి చెందిన శివన్న (27) అనే వ్యక్తి మతి చెందాడు. ఇతను ప్రమాదవశాత్తు గాయపడి గత మూడు నెలలుగా మతిస్థిమితం లేదు. కుటుంబీకులు అతనికి తిరుపతిలో చికిత్స చేయించుకుని రైలులో వస్తుండగా స్టేషన్ నుండి పరారయ్యాడు. పట్టణంలోని రెండు మూడు చోట్ల వాహనాల నడుమ దూరేందుకు యత్నించి చివరికి లారీ కింద పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

గుత్తి, మే 1 ప్రభాతవార్త



నోడల్ అధికారి మాట్లాడుతున్న దృశ్యం

నేటి సమాజంలో ప్రతిఒక్కరూ నైతికబాధ్యతైన తమ ఓటు హక్కును వినియోగించుకోవా లని నోడల్ అధికారి రాజ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పెన్షనర్ల కార్యా లయంలో బుధవారం ఓటు హక్కు వినియోగం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 సంవత్సరాలు దాటిన వారు తమ ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఇరాజ్‌కుమార్, సంఘంఅధ్యక్ష, కార్యదర్శులు అబూబకర్, కుళ్లాయిబాబు, వెంకటేష్, స్వర్ణాంభ, తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ సెమిస్టర్ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను అభినందించిన కళాశాల యాజమాన్యం

ధర్మవరం రూరల్, మే 1 ప్రభాతవార్త



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలో పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల విజయ ఢంకా మోగించారు. కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి నీలు విజయదుర్గ 90 శాతం ఎం.జ్యోతి 87 శాతం, కె.ఫర్హీనా 85 శాతం, బి.ఫరీదా 80శాతం డి నాని 80శాతం ధరణి 81 శాతం, ఆర్.వైష్ణవి 80 శాతం ఆర్షియా 80 శాతం స్నేహప్రియ, 82 శాతం డి.హిమబిందు, 80 శాతం మార్కులతో విద్యార్థులను కళాశాలలో విజయఢంకా మోగించారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, విద్యార్థినీలకు మిఠాయిలు పంచిపెడుతూ అభినందనలు తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపాల్ మల్లికార్జున అభినందించారు.

## గుత్తిఆర్‌ఎస్‌లో అగ్నిప్రమాదం

గుత్తి, మే 1 ప్రభాతవార్త

గుత్తిఆర్‌ఎస్‌లోని ట్రాన్స్‌కోకార్యాలయంఎదుట అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సందర్భంగా ఎద్దుల రాజేష్ అనే వ్యక్తికి చెందిన గడ్డివామి అగ్నికి ఆహుతైంది. స్థానికులు గమనించి నీళ్ల చల్లి ఆర్పడంతో పాక్షికంగా ఆర్థిక నష్టం సంభవించింది. సమీపంలోని గడ్డివాములు అగ్నికి ఆహుతి కాలేదు.

## ఎటువంటి ఆందోళన చెందొద్దు.... అధికారులకు జిల్లా కలెక్టర్ ధైర్యం...

బళ్లారి, మే 01 ప్రభాతవార్త:



అవగాహన కల్పిస్తున్న జిల్లా కలెక్టర్

మే 7వ తేదీన బళ్లారి లోకసభ నియోజకవర్గం ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అతిబంధులు మరియు అధికారులు ఎటువంటి ఆందోళన చెందకూడదని బళ్లారి జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఎన్నికల సిబ్బందికి ధైర్యాన్ని నింపారు. ఎన్నికలకు ఎన్నికల నిర్వహణకు ఎంపికైన మరియు అధికారులకు పోలీస్ స్టేషన్ ఆహ్వాన కార్యక్రమంలో అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బళ్లారిలో జరగనున్న లోకసభ ఎన్నికల్లో అధికారులు మరియు సిబ్బందులు ఎటువంటి భయాందోళన చెందకూండా ఎన్నికల విధులను నిర్వహించాలని ఆయన కోరారు. జిల్లా యంత్రాంగం సిబ్బందిలకు మరియు అధికారులకు తగిన మౌలికసదుపాయాలు అందజేస్తామని ఆయన తెలిపారు. బళ్లారి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రత్యేకంగా పోలింగ్ బూత్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంలో బళ్లారి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ హేమంత్ కుమార్ ఉన్నతాధికారులకు, సిబ్బంది పాల్గొన్నారు.

## బళ్లారి లోకసభ ఎన్నికలు...పోస్టల్ ఓటింగ్‌కు భారీ స్పందన...

బళ్లారి, మే 01 ప్రభాతవార్త:



ఓటు హక్కును వినియోగించుకుంటున్న అధికారులు

మే 7వ తేదీన బళ్లారి లోకసభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం జిల్లా యంత్రాంగా ఇతర ఎన్నికల కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టల్ ఓటింగుకు భారీ స్పందన లభించింది. బళ్లారి జిల్లా కలెక్టర్ ఆవరణంలోని గాంధి భవనంలో జరిగిన ఈ పోస్టల్ ఓటింగులో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన సిబ్బందులు మరియు అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బళ్లారి లోకసభ ఎన్నికల పద్యంలో విధి నిర్వహణకు వచ్చిన ఇతర ప్రాంతాల అధికారులు మరియు ఇబ్బందులు ఈ పోస్టల్ ఓటింగ్లలో పాల్గొని, తమ ఓటు హక్కుపై సంతసాన్ని వ్యక్తం చేశారు. పోస్టల్ ఓటింగ్ మే 1వ తేదీ నుండి మూడవ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఇదే సందర్భంలో బళ్లారి జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్‌జుబేర్ పోస్టల్ ఓటింగ్ సెంటర్‌ను పరిశీలించి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ ఓటింగ్ వ్యవస్థను ప్రతి ఒక్క సిబ్బందులు మరియు అధికారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంలో ఉన్నతాధికారులు మరియు సిబ్బందులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి

**- సన్మానించి నూతన వస్త్రాలు అందించిన లయన్స్‌క్లబ్**

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి నూతన వస్త్రాలను అందించిన దృశ్యం

పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఉరవకొండ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యం.సి. జయకృష్ణ, కోశాధికారి సి.శ్రీరాములు అన్నారు. ఉరవకొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని క్లబ్ స్టడీ, యోగ కేంద్రంలో కార్మిక దినోత్సవం మే డే ఘనంగా నిర్వహించి ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీకు చెందిన 20 మంది పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి నూతన వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అనిర్వచనీయమని ఊరు తెల్లవారక ముందే లేచి మనందరి ఆరోగ్యం కోసం వీధులను శుభ్రం చేసి, కాలువల్లో మురుగు తొలగించి పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతారని వారు నిజమైన ప్రజా సేవకులని కొనియాడారు. నిరంతర శ్రామికులైన పంచాయతీ కార్మికులను కార్మిక దినోత్సవం రోజు సన్మానించడాన్ని బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోనల్ ఛైర్మెన్ యం.విశ్వనాధ్, టి.గణేష్‌బాబు, కె.బాలచంద్ర, ఆర్.సత్యనారాయణ, పి.నూర్‌మహమ్మద్, సి.నాగేశ్వరరావు, బి.జయప్రకాష్, బి.నగేష్ తదతరులు పాల్గొన్నారు.

## కాపునాడు అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షుడిగా దండ కృష్ణప్రసాద్

**- ఉత్తర్వులు వెలువరించిన రాష్ట్ర అధ్యక్షుడు**

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



దండ కృష్ణప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఉరవకొండ పట్టణానికిచెందిన దండ కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.పి.నారాయణస్వామి రాయల్ నియామకపు ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా దండ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. రాష్ట్రంలో బలిజ, తెలగ, ఒంటరి, కాపు కులస్థుల ప్రయోజనాలకు, వారి శ్రేయస్సుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు వి.పి.నారాయణస్వామి రాయల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## మెరిట్ విద్యార్థినికి అండగా ఇన్ఫినిటీ చారిటబుల్‌ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్

కళ్యాణదుర్గం టౌన్, మే 1 ప్రభాతవార్త



ఆర్థిక సాయం అందజేస్తున్న ఇన్ఫినిటి చారిటబుల్ ట్రస్టు సభ్యులు

చదువలో బాగారానిస్తుంది. ప్రోత్సహించేందుకు కన్న తల్లి దండ్రులు లేరు. కానీ చదవాలన్నపట్టుదల ఉంది. ప్రోత్సాహం కరువైంది. మెరిట్ విద్యార్థిని చారిటబుల్ ట్రస్టు సభ్యుల ద్వారా విషయం తెలుసుకుని ఛైర్మన్ బద్దేనాయక్ దృష్టికి వచ్చింది. స్పందించిన బద్దేనాయక్ చేయూత అందించారు. వివరాల్లోకి వెళ్తే.. బ్రహ్మసముద్రం మండంలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన మెరిట్ విద్యార్థిని మెడికల్ కోర్సుకు చెందిన కోచింగ్ హైదరాబాద్‌లో తీసుకోవాలనుకున్నది చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి ఎన్నో కష్టాలతో మంచి మార్కులతో డిగ్రీ వరకు చదువుకున్నది. ఆర్థిక స్తోమత లేక ఇంటి వద్దనే ఉంది.. ఓ ఉపాధ్యాయుడి ద్వారా ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టును సంప్రదించగా అవసరమైన 16వేలు చెక్ అందించి, ముందు విద్యార్థిని భవిష్యత్తుకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ తోడ్పాటు ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్‌ఛైర్మన్ సురేష్, సభ్యులు లోకేష్, సాయినాథ్, మహాలింగ, ఉపాధ్యాయులు, ఓబులేసు పాల్గొన్నారు.

## చిన్నముష్టూరులో వడదెబ్బ, డెంగ్యూపై అవగాహన కార్యక్రమాలు

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



తాగునీటి కుళాయివద్ద మురుగు నిల్చున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో బుధవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు వడదెబ్బ, డెంగ్యూ జ్వరాలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగాయి. సీహెచ్‌ఓ వి.నాగరంగయ్య వడదెబ ఎ బారిన వడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ తగిలిన వారికి అందించాల్సి ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీలైనంతమేర ఎండలో తిరగవద్దన్నారు. తిరగాల్సి వచ్చినపుడు తెల్లటి దుస్తులు ధరించాలని, తలకుపాగా చుట్టుకోవడమో లేక టోపీలు, గొడుగులను వినియోగించమో చేయాలన్నారు. నీటిని వెంట పెట్టుకోవాలని, ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని సేవించాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.కోదండరామిరెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారానికి ఒకరోజు తప్పక డ్రై డే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, సీహెచ్‌ఓ హిమబిందు, సీఓ భగవాన్‌దాస్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాస్త్రీయ నృత్యాలు సజీవంగా ఉంచడానికి చేస్తున్న కృషి అభినందనీయం

**- గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి**

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న గవిమఠం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి.

కనుమరుగవుతున్న సాంప్రదాయ శాస్త్రీయ నృత్యాలైన కూచిపూడి, భరత నాట్యం తదితర నృత్యాలను సజీవంగా ఉంచడానికి అమ్మ తొలి దైవం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఉరవకొండ గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డాక్టరు కరిబసవరాజేంద్రస్వామి అన్నారు. 'అమ్మతొలి దైవం' సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు, పోలీస్ కమ్యూనికేషన్స్ ఎస్ఐ పాటిల్ రాజశేఖర్ నేతృత్వంలో చేపట్టిన కూచిపూడి, సినీ నృత్యాలు, సంగీతం, పాటల ఉచిత శిక్షణా శిబిరం ప్రారంభోత్సవం బుధవారం పట్టణంలోని షిరిడిసాయినగర్‌లోని సంస్థ కార్యాలయంలో జరుగగా ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి మాట్లాడుతూ కళలు పిల్లలకు మానసిక, శారీరక ఉత్సాహాన్ని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎక్కడ కళాభివృద్ధి ఉంటుందో ఆ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కళ భగవంతుని స్వరూపమని అన్నారు. సంస్థ వ్యవస్థాపకులు పాటిల్ రాజశేఖర్ మాట్లాడుతూ ఉరవకొండ ప్రాంతాన్ని కళలకు కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో గత 15 సంవత్సరాల క్రితం అమ్మ తొలిదైవం సంస్థను స్థాపించి ఆసక్తిగల చిన్నారులకు కూచిపూడి, శాస్త్రీయ నృత్యాలు, కర్నాటక సంగీతం లాంటి కళల్లో నిష్ణాతులైన గురువులను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. తమ సంస్థలో ఇప్పటివరకు దాదాపు 800 మంది వరకు పిల్లలు శిక్షణ పొందారని కార్తికేయ, ప్రశాంతి తదితరులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి బహుమతులు పొందారని వివరించారు. ఆసక్తిగల పిల్లలు ఉచిత శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నాటక సంగీతం మాస్టర్, యం,నారాయణస్వామి, శ్రీకాంత్, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుద్ధనీటి చలివేంద్రం ఏర్పాటు

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



శుద్ధనీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని విపత్తు నివారణ అగ్నిమాపకశాఖ కార్యాలయం ఎదురుగా జై కిసాన్ అగ్రో ట్రేడర్స్ సంస్థవద్ద శుద్ధనీటి (మినరల్ వాటర్) చలివేంద్రాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగమల్లి ఓబులేష్, రజనీకుమారి దంపతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వివిధ పనుల కోసం వచ్చే రైతులు, స్థానిక ప్రజలకు చల్లటి శుద్ధనీటిని అందించి వారి దాహార్తిని తీర్చాలన్న ఉద్దేశంతో కార్మికుల దినోత్సవం రోజు చలివేంద్రాన్ని ప్రారంభించామని ఈ చలివేంద్రం నెలరోజులపాటు సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జైకిసాన్ ఫౌండేషన్ సేవా సంస్థ ప్రతినిధి వెంకట్ గురూజీ, లయన్స్ క్లబ్ జోనల్ సభ్యులు టి.గణేష్‌బాబు, గోపాలకృష్ణ, మినరల్ వాటర్ ప్లాంటు యజమాని గోపాల్, నాగమల్లి రాధమ్మ, ఫౌండేషన్ ప్రతినిధులు నాగమల్లి మనస్వి, లావణ్య, సుందరేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవుల పక్షాణ గళమెత్తిన ఏకైక నాయకురాలు వై.ఎస్.షర్మిల

**- విలేఖరుల సమావేశంలో పాస్టర్ల సంఘాల నాయకులు**

ఉరవకొండ, మే 1 ప్రభాతవార్త



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్ల సంఘం నాయకులు

క్రైస్తవుల పక్షాణ గళమెత్తిన క్రైస్తవుల సంక్షేమ సారథి వై.ఎస్.షర్మిల అని డెమోక్రసీ ఆఫ్ క్రిష్టియన్ మూమెంట్ జిల్లా కన్వీనర్ శ్యామ్, ఉరవకొండ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్, నాయకులు సుందర్, డేవిడ్‌రాజు, ఐజాక్, ఇశ్రాయేల్, షాలేం తదితరులు అన్నారు. పట్టణంలోని స్థానిక సత్యం కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్రైస్తవులపట్ల రాష్ట్ర ప్రభుత్వ పనితీరు సరిగ్గాలేదని విమర్శించినవారు రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు, అరాచకాలు జరుగుతున్నా నాయకులు స్పందించడంలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రైస్తవుల పక్షాన గళమెత్తిన ఏకైక నాయకురాలు షర్మిలమ్మని ఆమె కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రంలో రాజన్న రాజ్యం తీసుకురావాలని పడుతున్న తపన హర్షనీయమన్నారు. మోదీ హయాంలో దేశంలో క్రైస్తవులకు రక్షణ కరువైందని పాస్టర్లపై అక్రమ కేసులు పెట్టి వేదిస్తున్నారన్నారు. బీజేపీ పాలనలో మణిపూర్‌లో క్రైస్తవులను ఊచకోత కోసారని అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రైస్తవుల గూర్చి పార్లమెంటులో గళం వినిపించేందుకు షర్మిలమ్మకు అవకాశం కల్పించాలన్నారు. షర్మిలమ్మది దైవ కుటుంబమని ఆమె భర్త బ్రదర్ అనీల్‌కుమార్ గొప్ప సువార్తికుడని ఆశీర్వాద పండుగలు లాంట కార్యక్రమాలు నిర్వహిస్తూ జీసస్ చారిటీ ఆధ్వర్యంలో దీన జనసేనలో తరిస్తూ ఎన్నో మంచి కార్యాలను ఆ దంపతులు చేస్తున్నారన్నారు. క్రైస్తవులు మైనార్టీలు కాదు మెజార్టీలు అని నిరూపించుకోవాలన్నా దేవుని రాజ్యాన్ని నిర్మించాలన్న క్రైస్తవ సమాజంలోని ప్రతిఒక్కరూ షర్మిలమ్మను గెలుపునకు కృషి చేయాలని పిలుపునిస్తూ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

